సాక్షి
మెదక్
మంగళవారం । 24 । జూన్ । 2025



కోమటిచెరువు సుందరీకరణ!

సిద్దిపేటలోని కోమటి చెరువును సుందరీకరించేందుకు బల్దియా అడుగులు వేస్తోంది.

వివరాలు 8లో ▸



మెరుగైన వైద్యం అందించాలి

ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు.

వివరాలు 9లో ▸

న్యాయ విజ్ఞాన సదస్సు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని ఔరంగాబాద్‌లో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయవాది బాల నర్సింలు మాట్లాడుతూ.. ఆర్థికంగా బలహీనులైన పేదలకు ఉచిత న్యాయం అందించడమే లక్ష్యంగా న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తుందని తెలిపారు.

న్యూస్‌రీల్

కేంద్ర పథకాలపై రచ్చబండ



మాట్లాడుతున్న రాగి రాములు

రామాయంపేట(మెదక్): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ కృషితో దేశ కీర్తి ప్రతిష్టలు పెరిగాయని కొనియాడారు. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజల శ్రేయస్సు కోసం ప్రధాని పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు శీలం అవినాశ్‌రెడ్డి, నాయకులు చింతల శేఖర్, శంకర్‌గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులతో సీఎం ముఖాముఖి

మెదక్ కలెక్టరేట్: సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ.. మంగళవారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో మాట్లాడుతారని అన్నారు. కార్యక్రమాన్ని పండగల నిర్వహించేందుకు ప్రతి రైతు వేదిక వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం భూ భారతి రెవెన్యూ సదస్సులపై అధికారులతో చర్చించారు. సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించేందుకు పటిష్ట కార్యాచరణతో ముందుకుసాగాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓలు రమాదేవి, జయచంద్రారెడ్డి, మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత

నర్సాపూర్: జూలై 9వ తేదీన చేపట్టే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని పలు శాఖల ఉద్యోగులు సోమవారం ఆయాశాఖల అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఐసీడీఎస్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ హఫీజాబేగంకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ అధికారికి కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారు.

నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పర్యటించనున్నట్లు డీఎల్‌పీఆర్‌ఓ రాంచంద్రరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ భూములు, అట్రాసిటీ కేసులపై సమీక్ష ఉంటుందని తెలిపారు. అనంతరం ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకోనున్నట్లు చెప్పారు. జిల్లాలోని దళిత, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు, జిల్లా అధికారులు సమీక్ష సమావేశానికి హాజరుకావాలని కోరారు.

పేదల సొంతింటి కల సాకారం

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



ఎల్లాపూర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్ రూరల్/శివ్వంపేట: ఇందిరమ్మ ఇంటితో పేదల సొంతింటి కల నెరవేరుతుందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లాపూర్, మాడాపూర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డితో కలసి కాంగ్రెస్ జెండాలను ఆవిష్కరించి, ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కావాలని కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కో ఆపరేటివ్ చైర్మన్ రాజు యాదవ్, మాజీ జెడ్పీటీసీ గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్, నాయకులు సురేష్ నాయక్, ఉదయ్, వినోద, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శివ్వంపేట మండల పరిధిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే సునీతారెడ్డికి సమాచారం లేకుండా భూమి పూజ ఎలా చేస్తారని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించడంతో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. భోజ్యా తండాలో తనకు ఇల్లు మంజూరు కాలేదని కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్‌ని ఓ వ్యక్తి అడ్డుకున్నాడు.

మీనమేషాలు

ఉచిత చేప పిల్లల పంపిణీపై నీలినీడలు

- ఏటా మార్చి, ఏప్రిల్‌లోనే టెండర్ల ప్రక్రియ
- ఈ ఏడాది ఊసేలేని వైనం!
- ఆందోళనలో మత్స్యకారులు

మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వానాకాలం ప్రారంభం అయినప్పటికీ ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో మత్స్యకారులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తికావాల్సి ఉండగా, ఆదిశగా ప్రయత్నాలు కనిపించడం లేదు.

– మెదక్‌జోన్



జిల్లావ్యాప్తంగా 311 మత్స్యకార్మిక సంఘాలు ఉండగా, వాటిలో 16,820 మంది సభ్యులు ఉన్నారు. కాగా జిల్లాలో చేపలను పెంచేందుకు 1,728 చెరువులు అనుకూలమైనవి ఉన్నాయని అధికారులు గుర్తించారు. గతేడాది కురిసిన వర్షాలకు జిల్లాలోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. ఈసారి ముందస్తుగానే రుతుపవనాలు పలకరించినా చేప పిల్లల టెండర్ల ఊసే లేకుండా పోయింది. మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతూ నీలి విప్లవాన్ని సాధించే దిశగా మొదలుపెట్టిన చేప పిల్లల పంపిణీ ఈసారి కూడా సరైన సమయంలో పంపిణీ చేసే పరిస్థితి లేదని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలాఉండగా గతేడాది పలుమార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. ఇందుకు ప్రధాన కారణం గతంలో టెండర్ దక్కించుకొని చేప పిల్లలను వదిలిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడమేనని తెలిసింది. చివరికి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు అధికారులు నచ్చజెప్పగా, అతడు టెండర్ దక్కించుకున్నాడు.

డిమాండ్ కోట్లలో.. వదిలింది లక్షల్లో

గతేడాది 1,654 చెరువుల్లో 5.10 కోట్ల ఉచిత చేప పిల్లలను వదలాల్సి ఉండగా, కేవలం 64 లక్షల పిల్లలను మాత్రమే వదిలి సదరు కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు. దీంతో చేసేదిలేక మత్స్యకారులు కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ వ్యక్తుల నుంచి చేప పిల్లలను కొనుగోలు చేసి నీటి వనరుల్లో పోశారు. ఈ ఏడాది సంబంధిత అధికారులు ఈ పథకానికి సంబంధించి ఇంకా ఊసే ఎత్తకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

16,820 మందికి ఉపాధి

జిల్లాలో 16,820 మంది మత్స్య కార్మికులు కేవలం చేపల వేట ద్వారానే జీవనం సాగిస్తున్నారు. గతేడాది సైతం నామమాత్రంగా చేప పిల్లలను వదిలిన అధికారులు, ఈ ఏడాది ఇప్పటివరకు ఎలాంటి టెండర్లు పిలవకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. ఉచిత చేప పిల్లలను చెరువు, కుంటల్లో వదలకుంటే తమకు జీవనోపాధి ఎలా అంటూ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎలాంటి ఆదేశాలు రాలేదు



ఉచిత చేప పిల్లల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఏటా మార్చి, ఏప్రిల్‌లోనే టెండర్లు పిలుస్తారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పక్రియ సాగిస్తాం.

– మల్లేశం, మత్స్యశాఖ ఏడీ

ఆర్వోబీ నిర్మాణానికి రూ. 45 కోట్లు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): మెదక్– చేగుంట రోడ్డులో రైల్వేగేటు వద్ద ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 45 కోట్లు మంజూరు చేసిందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. సోమవారం చేగుంట ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. దుబ్బాక ఉపఎన్నికలో ఇచ్చిన హామీ మేరకు రెడ్డిపల్లి చౌరాస్తా వద్ద ఫ్లై ఓవర్ నిర్మించి ప్రమాదాలను నివారించినట్లు చెప్పారు. ఎంపీ ఎన్నికల్లో చేగుంట రైల్వేగేటు వద్ద ఆర్వోబీ నిర్మాణానికి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆర్వోబీ నిర్మాణానికి రాష్ట్ర వాటా నిధులను కేటాయించాలని కేంద్రం కోరగా, ఇవ్వలేమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్రానికి లేఖ రాశారన్నారు. రాష్ట్ర వాటా లేకున్నా వందశాతం కేంద్రం నిధులను మంజూరు చేయించినట్లు వివరించారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయిందని, రెండు వారాల్లో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. 18 నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించి రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఎల్లారెడ్డి, నాయకులు నాగవేందర్‌రెడ్డి, భూపాల్, సంతోష్‌రెడ్డి, గణేష్, రవికుమార్, రఘువీర్‌రావు, నాగభూషణం, సాయిబాబా, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- ప్రజావాణి అర్జీలు పెండింగ్ ఉండొద్దు
- అధికారులకు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: ప్రజలకు జవాబుదారీగా ఉంటూ మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ తమ సమస్యలపై 119 వినతులు అందజేశారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణి దరఖాస్తులు ఒక్కటి కూడా పెండింగ్ ఉండకూడదన్నారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ ఫుడ్ క్యాంటీన్‌ను పరిశీలించారు. జంక్ ఫుడ్‌తో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. ఈసందర్భంగా మహిళా శక్తి ద్వారా ఆర్థిక సాయంతో మిల్లెట్ ఫుడ్ క్యాంటీన్ ఏర్పాటు చేసిన అనితను అభినందించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడమే కాకుండా ప్రజలకు ఆరోగ్యాన్నిచ్చే ఇలాంటి ఆహారం అందించడం అభినందనీయమని కొనియాడారు. అనితను స్ఫూర్తిగా తీసుకొని మిగితా సంఘాల సభ్యులు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, డీపీఓ యాదయ్యతో పాటు జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరసనల హోరు..

కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి సందర్భంగా పలు సంఘాల సభ్యులు, బాధితులు తమ తమ సమస్యలపై నిరసన తెలిపారు.

- భూభారతి సదస్సులో దరఖాస్తులు తీసుకొని చేగుంట ఎమ్మార్వోపై చర్యలు తీసుకోవాలని చేగుంట మండలం చిట్టోజిపల్లి గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- రామాయంపేట మత్స్యకార సొసైటీలో అక్రమాలు అడ్డుకొని అర్హులైన మత్స్యకారులకు న్యాయం చేయాలని మత్స్యకార సంఘ సభ్యులు మొర పెట్టుకున్నారు.
- తన పట్టా భూమిని లాక్కుంటున్నారని చిలప్‌చెడ్ మండలం చండూర్‌కు చెందిన బాధితుడు పుల్కంటి లాజర్ ఆవేదన వ్యక్తం చేశాడు.
- పండ్లు అమ్ముకుంటూ జీవించే నిరుపేదలం తమకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలంటూ రామాయంపేట మండలం వెంకటాపూర్ గ్రామ మహిళలను వేడుకున్నారు.
- తమ సమస్యలు పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగులు నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

పల్లెలన్నీ చెత్తతో నిండిపోయాయి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

- పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ పోసే దిక్కు లేదు
- ప్రభుత్వంపై ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫైర్

నర్సాపూర్ రూరల్: గ్రామాలు స్వచ్ఛతగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పంచాయతీలకు చెత్త తరలించేందుకు ట్రాక్టర్లు ఇస్తే, ప్రస్తుత ప్రభుత్వంలో కనీసం డీజిల్ పోసే దిక్కు లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సోమవారం మండలంలోని చిప్పల్‌తుర్తి గ్రామ పంచాయతీని సందర్శించి పారిశుద్ధ్య కార్మికులతో పాటు పంచాయతీ కార్యదర్శితో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో చెత్త తరలించడంలో నిర్లక్ష్యం వహిస్తే అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. మూడు నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబ పోషణ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా మాజీ కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాబ్యా నాయక్ ఉన్నారు.

అరెస్టులపై కాదు.. గ్రామాలపై దృష్టి పెట్టు

అరెస్టులపై కాదు.. గ్రామాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. గ్రామాల్లో వీధి దీపాలు, తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ అన్న మార్పు ఇదేనా అని ఎద్దేవా చేశారు. 10 నుంచి 20 శాతం పర్సంటేజీలు తీసుకొని కాంట్రాక్టర్లకు బిల్లులు ఇస్తున్నారని మండిపడ్డారు. సీఎం నెలకు ఒకసారి కూడా సచివాలయానికి పోవడం లేదని, హైదరాబాద్ నుంచి ఢిల్లీకి తిరగడమే సరిపోతుందన్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కూర్చుంటే ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు.

కార్యదర్శికి మెమో ఇవ్వడం సరికాదు: ఎమ్మెల్యే

గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై వివరాలు అడిగితే చిప్పల్‌తుర్తి పంచాయతీ కార్యదర్శి శ్రుతికు కలెక్టర్ మెమో జారీ చేయడం సరికాదని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గ్రామంలో నెలకొన్న పరిస్థితులు చెప్పారని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులకు తాము అండగా ఉంటామని చెప్పారు.

పోలీస్ బ్యాండ్ ట్రైనింగ్‌లో జిల్లాకు రెండో స్థానం: ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: పోలీస్ బ్యాండ్ ట్రైనింగ్‌లో జిల్లా రెండోస్థానం సాధించడంపై ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు పోలీస్ సిబ్బందిని సోమవారం అభినందించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ఈనెల 20 వరకు జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో భాగంగా జిల్లా 2వ స్థానం పొందిందని తెలిపారు. అతితక్కువ సమయంలో మంచి శిక్షణ పొంది అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు గానూ అభినందించి రివార్డు అందజేశారు. అంతకుముందు జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మహిళలను గ్రామైఖ్య సంఘంలో చేర్పించాలి'

నర్సాపూర్: మహిళలను గ్రామైఖ్య సంఘాలలో చేర్పించాలని ఐకేపీ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ భీమయ్య సూచించారు. సోమవారం మండల ఐకేపీ కార్యాలయంలో గ్రామ సంఘాల పదాధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదాధికారులు బాధ్యతలు తెలుసుకొని గ్రామ సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. మహిళల ఆర్థిక సామాజిక ప్రగతికి తోడ్పడే విధంగా సంఘాలు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కెన్నెడీ, ఏపీఎం గౌరిశంకర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుమలత, కార్యదర్శి మౌనిక, కోశాధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో ఆరోగ్యానికి ముప్పు

అదనపు కలెక్టర్ నగేశ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

హవేళిఘణాపూర్(మెదక్): విద్యార్థులు మాదకద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. సోమవారం మెదక్ మండల పరిధిలోని రాజ్‌పల్లిలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలతో అనేక మంది అనారోగ్యం బారినపడి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. అందుకోసం ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పించి ప్రాణాలు కాపాడునే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతీ విద్యార్థి మొక్కలు నాటి, వాటిని కాపాడే విధంగా చూడాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమావతి, ఎంపీడీఓ రఘు, హెచ్‌ఎం శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతు కూలీలపై ఆత్మీయం ఏదీ?

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందని ద్రాక్షేనా?

- ఉమ్మడి మెదక్ జిల్లాలో 51,818 మంది లబ్ధిదారుల ఎంపిక
- పైలెట్ గ్రామాలకే పరిమితమా..
- త్వరగా అందజేయాలంటూ వేడుకోలు



ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం రైతు కూలీలు ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా రైతు కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' కింద ఏడాదికి రూ.12వేల చొప్పున ఇస్తామని ప్రకటించింది. పథకాన్ని ఉమ్మడి మెదక్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా 70గ్రామాల్లో ప్రారంభించి దాదాపు ఐదు నెలలవుతున్నప్పటికీ ఇంకా అన్ని గ్రామాల్లో అమలు చేయడం లేదు. లబ్ధిదారులు ఎంపికైనప్పటికీ ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి, సిద్దిపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధిదారులకు అందని ద్రాక్షగానే మారింది. భూమిలేని ఉపాధి హామీ కూలీలకు రైతు భరోసా కింద ఏటా రూ.12వేల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండు విడతల్లో సాయం అందించనుంది. అందులో భాగంగా జనవరి 26న జిల్లా వ్యాప్తంగా ఒక్కో మండలం ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి 2,181 మందికి ఆత్మీయ భరోసా అందించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

వ్యవసాయ భూమి లేనివారు, ఉపాధి హామీ కూలీగా 20 రోజుల పాటు పని చేసిన వారు అర్హులని నిబంధన పెట్టారు. లబ్ధిదారుల ఎంపిక కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,531 గ్రామాల్లో 51,818 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారిలో ఇప్పటి వరకు 2,181 మందికే అందించడంతో 49,637 మంది లబ్ధిదారులు ఆత్మీయ భరోసా కోసం ఎదురు చూస్తున్నారు.

ఆత్మీయ పథకం వివరాలు..

జిల్లా	లబ్ధిదారులు
సిద్దిపేట	16,505
మెదక్	12,521
సంగారెడ్డి	22,792

70 గ్రామాలకే పరిమితం

ఉమ్మడి మెదక్ జిల్లాలో 70మండలాల్లో ఒక్కో గ్రామ పంచాయతీని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి జనవరి 26న 2.181 మందికి మంజూరు పత్రాలను అందజేశారు. తర్వాత రూ.6వేల చొప్పున బ్యాంక్ ఖాతాలలో రూ. 1,30,86,000 జమ చేశారు. పైలెట్ ప్రాజెక్ట్‌లో అందుకున్న వారికి మరో నెల రోజులైతే రెండో విడత సాయం అందించాల్సిన సమయం వస్తుంది. మిగతా లబ్ధిదారులకు ఆత్మీయ భరోసా వస్తుందా? రాదా? అని ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఇస్తారనేది అధికారులు ఎవరు చెప్పడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింది ఎంపిక చేసిన లబ్ధిదారులకు సాయం అందజేయాలని కోరుతున్నారు.

డబ్బులు ఇవ్వలేదు



మాకు వ్యవసాయ భూమి లేదు. ఉపాధి హామీ, వ్యవసాయ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా ఏడాదికి రూ.12వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ పథకానికి నేను ఎంపిక అయిన్నట్లు గ్రామ సభలో ప్రకటించారు. ఇప్పటి వరకు డబ్బులు ఖాతాలో జమ కాలేదు.

– అనూష, రామవరం, అక్కన్నపేట

గుంట భూమి లేదు



మాకు గుంట భూమి లేదు. ఉపాధి హామీ పనులతోనే పూట గడుస్తుంది. ఉపాధి పనులు లేనప్పుడు ఊరిలోనే కూలీ పనులకు వెళ్తాను. భూమి లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం తీసుకురావడం బాగానే ఉంది. ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ. 12వేలు వస్తాయంటే సంతోషపడ్డాను. పేరు వచ్చి దాదాపు ఐదు నెలలు అవుతున్నా ఇప్పటికీ పైసా రాలేదు. ఆత్మీయ భరోసా కొంత ఆసరా అవుతుందని అనుకున్నా..

–సంకోజు అన్నపూర్ణ, తిమ్మాపూర్, జగదేవ్‌పూర్

క్లుప్తంగా

రైస్‌మిల్లు కార్యాలయంలో రూ. 90 వేలు చోరీ


సీసీ కెమెరాలో నిందితుడు

శివ్వంపేట(నర్సాపూర్‌): రైస్‌మిల్లు కార్యాలయంలో చోరీ జరిగింది. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శివ్వంపేట గ్రామ శివారులో ఉన్న ఓం సాయి వెంకటరమణ రైస్‌మిల్లు కార్యాలయంలోకి గుర్తు తెలియని వ్యక్తి గదుల తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డాడు. కౌంటర్‌లో ఉన్న రూ.90 వేలు తస్కరించాడు. నిందితుడు ముఖానికి మాస్క్‌, చేతులకు గ్లౌజ్‌ ధరించి సీసీ కెమెరాలకు చిక్కకుండా జాగ్రత్త పడ్డాడు. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి, క్లూస్‌ టీం పరిశీలించి ఆధారాలు సేకరించారు. మిల్లు యజమాని రంగాయ్యగుప్తా ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉసురు తీసిన అప్పులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గంగయ్య

పాపన్నపేట(మెదక్‌): అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటన పాపన్నపేట మండల పరిధిలోని మల్లంపేటలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చింతకుంట గంగయ్య(50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. పొలంలో మూడు బోర్లు వేసినా ఆశించిన రీతిలో నీరు పడలేదు. దీంతో పంట దిగుబడి తగ్గింది. దీనికి పెద్దకూతురు పెళ్లికి అప్పు చేశాడు. అప్పులను తీర్చడానికి భూమి అమ్మాలని నిర్ణయించుకున్నాడు. కానీ.. ప్రస్తుతం భూమి అమ్మితే.. ,రెండో కూతురు పెళ్లి ఎలా చేయాలన్న ఆవేదనతో ఈ నెల 15న క్రిమి సంహారక మందు తాగాడు. పరిస్థితి విషమంగా మారడంతో వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

పార్ట్‌టైం జాబ్‌ పేరిట మోసం

రూ.6.58 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

నర్సాపూర్‌: సైబర్‌ నేరగాళ్ల వలలో చిక్కి ఓ వ్యక్తి రూ.6.58 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన నర్సాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పార్ట్‌టైం జాబ్‌ పై ఆసక్తి ఉన్న వ్యక్తులు ఈ లింకు ఓపెన్‌ చేయాలని ఉదయ్‌కిరణ్‌కు మెసేజ్‌ వచ్చింది. అతను లింకును ఓపెన్‌ చేయగా రూ.10,870 బోనస్‌ పాయింట్స్‌ వచ్చాయని ఉంది. అనంతరం కొన్ని రోజులకు రూ.10 వేలు పెట్టుబడి పెట్టాడు. దీంతో ఖాతాకు కొన్ని డబ్బులు వచ్చాయి. కొన్నాళ్ల పాటు వైబ్‌సైట్‌కు ఉదయ్‌కిరణ్‌ డబ్బులు పంపడం, అతనికి తిరిగి డబ్బులు వచ్చాయి. ఇలా రూ.6.58 లక్షలు జమ చేశాడు. డబ్బులు డ్రా చేసుకునేందుకు యత్నించగా.. అది పని చేయకపోవడంతో మోస పోయాయని గ్రహించిన ఉదయ్‌కిరణ్‌ గుర్తించి సైబర్‌ క్రైంకు ఫిర్యాదు చేశాడు.

మోకు మేకైంది

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చేర్యాల(సిద్దిపేట): తాటి చెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడు గాయపడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్దరాజుపేటలో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొయ్యడ చంద్రంగౌడ్‌ ఎప్పటిలాగే కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తూ మోకు జారి కింద పడ్డాడు. గమనించిన తోటి గీత కార్మికులు.. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కల్లు గీత వృత్తిపైనే ఆధారపడి జీవించే చంద్రంను ప్రభుత్వం ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి అరుణ్‌ కోరారు.

ఏడుగురు జూదరుల అరెస్టు


నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

చేగుంట(తూప్రాన్‌): జూదం ఆడుతున్న వ్యక్తులను టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన చేగుంట మండలంలోని చిట్టోజిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం చిట్టోజిపల్లి శివారులో జూదం ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఏడుగురు నిందితులను పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.44వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

సీజ్‌ చేసిన ఇసుక డంప్‌ మాయం

తూప్రాన్‌: సీజ్‌ చేసిన ఇసుక డంప్‌ మాయమైంది. ఈ మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని కిష్టాపూర్‌ హల్దీవాగులో అక్రమంగా ఇసుక ఫిల్టర్‌ ద్వారా తయారు చేసిన ఇసుక డంప్‌ను ఎస్‌ఐ శివానందం, రెవెన్యూ అధికారులు ఈ నెల 20న సీజ్‌ చేశారు. 23న సోమవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారు. కానీ సీజ్‌ చేసిన ఇసుక డంప్‌ను అక్రమ వ్యాపారులు రాత్రికి రాత్రే డంప్‌ను మాయం చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కోమటిచెరువు సుందరీకరణ!

ప్రక్షాళన దిశగా బల్దియా అడుగులు

- మూడు కిలోమీటర్ల పొడవునా ప్రక్రియ
- కెనాల్‌ ఇరువైపులా ఫుట్‌పాత్‌
- అక్రమకట్టడాల తొలగింపు
- రేపో మాపో క్షేత్రస్థాయిలో ఆరా
- రెవెన్యూ, మున్సిపల్‌, ఇరిగేషన్‌ శాఖల జాయింట్‌ సర్వే


కోమటిచెరువు కెనాల్‌

సిద్దిపేటజోన్‌: దశాబ్దాల చరిత్ర ఉన్న సిద్దిపేట బావిష్‌ఖానపూల్‌ కోమటిచెరువు కెనాల్‌) ప్రక్షాళన దిశగా బల్దియా అడుగులు వేస్తోంది. సుందరీకరణ, అక్రమ కట్టడాల నియంత్రణతో మునిసిపల్‌ అధికారులు భవిష్యత్‌ ప్రణాళికను రూపొందించారు. కోమటిచెరువు మత్తడివాగును సుందరీకరణ చేసేందుకు యంత్రాంగం సన్నద్ధం అయింది. సుమారు మూడు కిలోమీటర్ల పొడవునా ఉన్న కెనాల్‌ను అందంగా తీర్చిద్దేందుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే రెండు రోజుల్లో మున్సిపల్‌, రెవెన్యూ, ఇరిగేషన్‌ శాఖల ఆధ్వర్యంలో కెనాల్‌కు ఇరువైపులా జాయింట్‌ సర్వే చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. నీటిపారుదల శాఖ నిబంధనలకు విరుద్ధంగా కెనాల్‌కు ఇరువైపులా నిర్మించిన అక్రమ కట్టడాల గుర్తింపు ప్రక్రియ జాయింట్‌ సర్వే ద్వారా తేల్చనున్నారు. కెనాల్‌కు ఇరువైపులా పాదచారుల నడక కోసం పాత్‌ వేతో పాటు రెండు పక్కలా బయో ఫెన్సింగ్‌ చేయాలని బల్దియా అధికారులు నిర్ణయించారు. వంద రోజుల యాక్షన్‌ ప్లాన్‌లో భాగంగా ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

జిల్లా కేంద్రంలోని కోమటిచెరువు మత్తడివాగు చాలా పురాతనమైనది. కోమటిచెరువు వరద నీటి ప్రవాహం మత్తడి ద్వారా ఇదే కెనాల్‌ మార్గం గుండా నర్సాపూర్‌ చెరువులోకి వెళ్లేది. ప్రస్తుతం పట్టణం పెరిగిపోతోంది. దీనితో కెనాల్‌ ఇరువైపులా నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మరోవైపు కెనాల్‌ పర్యవేక్షణ వైఫల్యం వల్ల కెనాల్‌ మొత్తం గుర్రపు డెక్క, చెత్త చెదారం లాంటి వాటితో నిండిపోయింది. కెనాల్‌ అస్తవ్యస్తంగా మారి పట్టణ సుందరీకరణకు ఆటంకంగా మారింది. వర్షాకాలంలో కోమటిచెరువు నీటి మట్టం పెరిగిపోయి, మత్తడి ద్వారా నీటి ప్రవాహం, దీనికి తోడు వర్షాల వరద నీటి ప్రవాహానికి కెనాల్‌లో నిండుకున్న మట్టి, గుర్రపు డెక్క అడ్డంకిగా మారుతోంది. దీనితో రోడ్లపైకి వరద నీరు ఉప్పొంగి రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం బల్దియా కోమటిచెరువు కెనాల్‌ సుందరీకరణ ప్రక్రియ చేపట్టింది.

మూడు శాఖలతో సర్వే

కోమటిచెరువు నుంచి నర్సాపూర్‌ వరకు ఉన్న నీటి పారుదల శాఖ కెనాల్‌ హద్దులు తేల్చే లెక్కల్లో అధికారులు ఉన్నట్లు సమాచారం. నీటిపారుదల శాఖ నిబంధనల మేరకు ఇరువైపులా కెనాల్‌కు ఒక మార్కింగ్‌ ఇచ్చి భూముల అన్యాక్రాంతం కాకుండా చూడాలనే సమాలోచనలో ప్రభుత్వ అధికారులు ఉన్నారు. అందుకు సంబంధించిన రెండు, మూడు రోజుల్లో రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్‌ అధికారులు జాయింట్‌ సర్వే చేయనున్నారు. మూడు కిలోమీటర్ల పొడవునా కెనాల్‌ మధ్య భాగం నుంచి ఇరువైపులా కొలతలు వేసి, నిబంధనల ప్రకారం హద్దులు నిర్ణయించాలని సంకల్పించారు. నిబంధనలు ఉల్లంఘించిన అక్రమ కట్టడాలు గుర్తించి వాటికి నోటీసులు జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ద్విముఖ లక్ష్యంతో...


కెనాల్‌కు ఇరువైపులా పొదలు

కోమటిచెరువు కెనాల్‌ను సుందరీకరణ చేస్తూ. కెనాల్‌కు ఇరుపక్కలా ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణకు బల్దియా సుందరీకరణ పేరిట ప్రక్రియ చేపట్టింది. అందులో భాగంగానే కోమటిచెరువు నుంచి హైదరాబాద్‌ రోడ్డు బ్రిడ్జి (బావిష్‌ ఖాన పుల్‌) వరకు ఒక భాగంగా, అక్కడి నుంచి నర్సాపూర్‌ చెరువు వరకు రెండవ భాగంగా విభజన చేసింది. మూడు కిలోమీటర్ల పొడవునా ఉన్న కెనాల్‌లో మొదటి దశలో డెక్క, సిల్ట్‌, చెత్త చెదారం తొలగించి, కెనాల్‌కు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలను తీసివేసే ప్రక్రియ చేపట్టారు. కెనాల్‌ను శుద్ధి చేసి తదుపరి చర్యలో కెనాల్‌కు రెండు వైపులా పట్టణ ప్రజలు వాకింగ్‌, జాగింగ్‌ చేసేలా పాత్‌ వే నిర్మాణం, ఇరుపక్కలా గచ్చకాయ చెట్లతో బయో ఫెన్సింగ్‌ చేయనున్నారు. అక్కడక్కడ వివిధ రకాల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు తయారు చేశారు. కెనాల్‌ ఆద్యంతం ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

యాక్షన్‌ ప్లాన్‌లో భాగంగా..



వంద రోజుల యాక్షన్‌ ప్లాన్‌లో భాగంగా కోమటిచెరువు కెనాల్‌ బ్యూటిఫికేషన్‌ ప్రక్రియ చేపట్టాం. వర్షాకాలంలో వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా కెనాల్‌ శుద్ధి చేస్తాం. ఇరువైపులా పాత్‌ వే, బయో పెన్సింగ్‌ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా చూస్తాం. త్వరలో జాయింట్‌ సర్వే జరగనుంది.

-ఆశ్రిత్‌ కుమార్‌, మున్సిపల్‌ కమిషనర్‌

పేలిన సిలిండర్‌

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- మహిళకు గాయాలు

నారాయణఖేడ్‌: ప్రమాదవశాత్తు వంటగ్యాస్‌ సిలిండర్‌ పేలి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఒకరు గాయాలతో బయట పడ్డారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్‌ మండలంలోని జంబికుంటలో భూలక్ష్మమ్మ జాత ఉత్సవాలు జరుగుతున్నాయి. దీంతో అన్ని కుంటుంబాల్లో బంధువుల అలజడి ఉంది. గ్రామానికి చెందిన నీరుడి మోహన్‌కు చెందిన కుటుంబంలో బందువుల రాకతో 25 మంది వరకు ఉన్నారు. ఉదయం బంధువులకు టిఫిన్‌ చేసేందుకు మోహన్‌ అత్త నాగమణి వంటగ్యాస్‌ సిలిండర్‌పై టిఫిన్‌ను తయారు చేస్తుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా గ్యాస్‌ సిలిండర్‌ పేలి మంటలు ఎగిసి పడ్డాయి. నాగమణి చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. కుటుంబీకులు, బంధువులు వెంటనే స్పందించి ఇంట్లోని నీటితో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయినా మంటలు చాలాసేపు ఎగిసి పడ్డాయి. కుటుంబీకులు, కాలనీవాసులు నీటిని చల్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే ఇంటి పైకప్పు, దూలాలు, బట్టలు, విద్యుత్‌ వైర్లు, బల్బులు పూర్తిగా కాలిపోయాయి. ఇల్లు కాలిపోయి పూర్తిగా దెబ్బతింది. ప్రమాద విషయం తెలుసుకొని తహసీల్దార్‌ నాగజ్యోతి ఆదేశాల మేరకు ఆర్‌ఐ జాన్సన్‌ ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

ముగ్గురు మహిళల అదృశ్యం

ఉమ్మడి మెదక్‌ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు అదృశ్యమయ్యారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఇద్దరు, సిద్దిపేటలో ఒకరు కనిపించకుండా పోయారు. పోలీసులు వీరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

పటాన్‌చెరు టౌన్‌: ఇంటికి బస్సులో వెళుతున్నానని చెప్పిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లికి చెందిన భానుప్రియ (20) ఈనెల 17న అమీన్‌పూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్‌గూడలో ఉండే సోదరి అనుష ఇంటికి వచ్చింది. 21న ఇంటికి వెళుతున్నానని సోదరికి చెప్పింది. దీంతో ఆమె తన భర్త శేఖర్‌ను వదిలి రమ్మని చెప్పగా.. అతను భానుప్రియను తీసుకెళ్లాడు. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని జీఎంఆర్‌ ఫంక్షన్‌ హాలు చౌరస్తా సమీపంలోకి రాగానే తాను బస్సులో వెళ్తానని చెప్పడంతో శేఖర్‌ ఆమెను అక్కడే వదిలి వెళ్లాడు. అయితే భానుప్రియ ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై తండ్రి వీరేశ్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి..

పటాన్‌చెరు టౌన్‌: డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన మానస (23) ఈనెల 21 తేదీన డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మానసకు ఫోన్‌ చేయగా.. స్విచ్ఛాఫ్‌ అని వచ్చింది. దీంతో ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

సిద్దిపేటకమాన్‌: వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన ఓ మహిళ అదృశ్యమైంది. సిద్దిపేట వన్‌ టౌన్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న కోరబోయిన రాజు తన భార్య శిరీషతో కలిసి వైద్య పరీక్షల నిమిత్తం ఇంటి నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి ఆదివారం వచ్చారు. రాజు తన ఆటోలో భార్యను ఆసుపత్రి ముందు దింపి వెళ్లాడు. మధ్యాహ్నం ఫోన్‌ చేయగా భార్య ఫోన స్విచ్ఛాఫ్‌ అని వచ్చింది. కేసు దర్యాప్తులో ఉంది.

కేసు భయమా... కుటుంబ కలహాలా..?

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చేర్యాల(సిద్దిపేట): ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు ఈ సంఘటన సోమవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని గట్టుతోటలో చోటు చేసుకుంది. వివరాలు.. కాలనీకి చెందిన యాట స్వామి ట్రాన్స్‌పోర్టు వాహనాల్లో నుంచి సరుకు దింపే పనులకు వెళుతుంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తాగిన మైకంలో పక్కింటి దాబాపైకి ఎక్కి ఇళ్లపై రాళ్లు వేశాడు. దీంతో దొంగలేమో అన్న భయంతో పక్కింటి వారు 100కి డయల్‌ చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. స్వామిని దాబాపై నుంచి కిందికి దించి అతని ఇంటి వద్ద వదిలేసి వెళ్లారు. కాగా, స్వామి సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. రాత్రి జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేస్తారేమోనని భయానికి ఆత్మహత్యాయత్నం చేసి ఉంటాడని కుటుంబసభ్యులు అంటున్నారు. అయితే.. భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్యాయత్నం చేశానని స్వామి తమకు చెప్పినట్లు ఎస్‌ఐ నీరేశ్‌ స్పష్టం చేశారు.

భార్య ఫిర్యాదు చేసేందుకు వెళ్లిందని..

భర్త బలవన్మరణం

పటాన్‌చెరు టౌన్‌: తనపై పోలీసులకు భార్య ఫిర్యాదు చేసేందుకు వెళ్లడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని అంబేడ్కర్‌ కాలనీకి చెందిన గాలి బాబురావు (47) శనివారం భార్య సంతోషమ్మతో గొడవ పడి కొట్టాడు. దీంతో ఆమె డయల్‌ 100కు కాల్‌ చేయగా.. పోలీసులు వచ్చి నచ్చజెప్పి వెళ్లారు. మరుసటి రోజు ఇద్దరి మధ్య గొడవ జరగడంతో భార్య ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. కొద్దిసేపటికే బాబురావు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె ఆడపడుచు లలిత ఫోన్‌ చేసి చెప్పింది. సంతోషమ్మ ఇంటికి వచ్చి చూడగా.. భర్త విగతజీవిగా కనిపించడంతో బోరుగా విలపించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరణంలోనూ భర్త వెంటే..

- ఒక్కరోజు వ్యవధిలో దంపతుల ఆత్మహత్య
- సంగారెడ్డి జిల్లా బొల్లారంలో విషాదం


అమరావతి


గణేష్‌

జిన్నారం (పటాన్‌చెరు): భర్త మరణాన్ని జీర్ణించుకోలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా బొల్లారం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ రవీందర్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం పట్టణ పరిధిలోని వైఎస్సార్‌ కాలనీలో నివాసముంటున్న గొల్ల గణేష్‌ (55) అనారోగ్య సమస్యతో బాధపడుతూ మనస్తాపానికి గురై శనివారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భార్య అమరావతి (47) భర్త మరణాన్ని జీర్ణించుకోలేక సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో చీరతో అదే ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. 24 గంటల వ్యవధిలో భార్యాభర్తలు మృతి చెందడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇరువురి మరణం భార్యాభర్తల ప్రేమ అనుబంధాలకు నిదర్శనంగా నిలిచిందని సంఘటనను చూసిన ప్రతి ఒక్కరి కళ్లు చెమ్మగిల్లాయి.

జాతీయ మహిళా హ్యాండ్‌బాల్‌ పోటీలకు శ్రీవాణి ఎంపిక

మద్దూరు(హుస్నాబాద్‌): సీనియర్‌ జాతీయ స్థాయి హ్యాండ్‌ బాల్‌ పోటీలకు దూల్మిట్ట మండలం బెక్కల్‌ గ్రామానికి చెందిన శ్రీవాణి ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్‌ బాల్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం తెలిపారు. ఆదిలాబాద్‌ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి త్వరలో గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్రం నుంచి గోల్‌కీపర్‌గా ప్రాతినిధ్యం వహించనుందన్నారు. శ్రీవాణి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

- ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించండి
- ఎంఈవోలు రోజుకు రెండు పాఠశాలలు తనిఖీ చేయాలి
- కలెక్టర్‌ ప్రావీణ్య ఆదేశం
- ఎంఈఓ, కస్తూర్బా ఎస్‌ఓలతో సమీక్ష



సమీక్షలో కలెక్టర్‌ ప్రావీణ్య. చిత్రంలో అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌, డీఈవో వెంకటేశ్వర్లు తదితరులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్‌: జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ ప్రావీణ్య విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. సోమవారం ఎంఈఓలు కస్తూర్బా పాఠశాలల ప్రత్యేక అధికారుల బడిబాట, మనఊరు- మనబడి, పాఠశాల విద్యా పటిష్టత కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సర్కార్‌ కల్పిస్తున్న సౌకర్యాలు , విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు వార్షిక విద్యా క్యాలెండర్‌ను పూర్తిగా అమలు చేయాలన్నారు. తనిఖీలకు వెళ్లినప్పుడు సమస్యలను విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకోవాలని సూచించారు.

ఆర్థిక పరిస్థితుల కారణంగా మధ్యలో చదువుకోవడం ఆపేసిన బాలికలను ఆయా మండలాలలో గల కస్తూర్బా పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంఈఓలు ప్రతిరోజు కనీసం రెండు పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు శాతం ఉపాధ్యాయుల బోధనకు విద్యార్థులు ఏ విధంగా సన్నద్ధమవుతున్నారు.. తదితర విషయాలను గమనించాలన్నారు. ప్రతిరోజు స్కూల్‌ ఎడ్యుకేషన్‌ యాప్‌లో తనిఖీ వివరాలు నమోదు చేయాలని చెప్పారు. మనఊరు-మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నచోట వెంటనే పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు 3429 మంది విద్యార్థులు వివిధ కళాశాలలో చేరినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియెట్‌ విద్యాశాఖ అధికారి గోవిందరావు, టీజీ ఈడబ్ల్యుఐడీసీ అధికారి శ్రీనివాస్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి


గంగారం మృతదేహం

కొల్చారం(నర్సాపూర్‌): ఎదురుగా వస్తున్న బైకును కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కొల్చారం మండలంలోని మెదక్‌- నర్సాపూర్‌ జాతీయ రహదారి కిష్టాపూర్‌ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ కథనం ప్రకారం.. పాపన్నపేట మండలం రామతీర్థం గ్రామానికి చెందిన కన్నెబోయిన గంగారాం (33) ఉదయం తన బైక్‌పై ఏడుపాయల నుంచి మెదక్‌కు పనిపై వెళ్తున్నాడు. కిష్టాపూర్‌ సమీపంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణం సమీపంలోకి రాగానే.. మెదక్‌ వైపు నుంచి వస్తున్న కారు.. గంగారం బైకును బలంగా ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్‌ అతి వేగమే ప్రమాదానికి కారణమని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుమ్మడిదల టోల్‌ ప్లాజా తొలగించండి

ఎమ్మెల్సీ అంజిరెడ్డి


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీలో టోల్‌ప్లాజా ఏర్పాటు పరిసర ప్రాంతాల ప్రయాణికులు, వాహనదారులకు ఆర్థిక భారంగా మారిందని వెంటనే దానిని తొలగించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం నేషనల్‌ హైవే అథారిటీ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ అధికారి మాధవికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నేషనల్‌ హైవే నిబంధన ప్రకారం రోడ్డు ప్రారంభం నుంచి ముగింపు మధ్యలో టోల్‌ప్లాజా ఏర్పాటు చేయాల్సి ఉండగా రోడ్డు ప్రారంభంలోని గుమ్మడిదలలో ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల గ్రామాల, మండలాల ప్రజలకు టోల్‌ భారం తప్పడం లేదన్నారు. దీంతో జిన్నారం, మెదక్‌ జిల్లా నర్సాపూర్‌ నుంచి ప్రయాణించే వాహనదారులు టోల్‌ ప్లాజా ద్వారా ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. గుమ్మడిదల ప్రస్తుతం మున్సిపాలిటీగా మారడంతో అక్కడ టోల్‌ ప్లాజా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతుందని వెంటనే టోల్‌ ప్లాజాను తొలగించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో అంజిరెడ్డితోపాటు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య

సంగారెడ్డి క్రైమ్‌: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రమేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మంజీరానగర్‌కు చెందిన కుమ్మరి పెంటన్న(46), ప్రమీల దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. ఝరాసంగం మండలానికి చెందిన దంపతులు బతుకు దెరువు నిమిత్తం ఏడేళ్ల క్రితం సంగారెడ్డి పట్టణానికి వచ్చారు. పెంటన్న స్థానికంగా కల్వకుంటలో ఉండే ఎంకే ట్రేడర్స్‌లో కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే ఆదివారం రాత్రి పది గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చి తన గదిలోకి వెళ్లి లుంగీతో ఉరేసుకున్నాడు. అనుమానంతో కుటుంబ సభ్యులు వెంటనే తలుపులు బద్దలు కొట్టి చూడగా.. అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

పైసలిస్తేనే రిజిస్ట్రేషన్‌!

- భూమి గిఫ్ట్‌ రిజిస్ట్రేషన్‌ కోసం నాలుగురోజులుగా ఓ మహిళ ప్రదక్షిణలు
- ఖేడ్‌ తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట గిరిజన మహిళ ఆందోళన
- లంచం అడగలేదని తహసీల్దార్‌ వివరణ


తహసీల్దార్‌ కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్న లక్ష్మీబాయి, ఆమె కుటుంబ సభ్యులు

నారాయణఖేడ్‌: మనవళ్ల పేరిట భూమిని గిఫ్ట్‌ రిజిస్ట్రేషన్‌ చేయించుకోవాలని వస్తే.. పైసలిస్తేనే గానీ పనికానిచ్చేది లేదని అధికారులు నాలుగైదు రోజులుగా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. దీంతో తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట సదరు మహిళ ఆందోళనకు దిగింది. ఖేడ్‌ మండలంలో సోమవారం వెలుగు చూసిన ఈ ఘటన వివరాలు బాధితుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. కొండాపూర్‌ స్కూల్‌ తండాకు చెందిన లక్ష్మీబాయికి ఖేడ్‌ మున్సిపల్‌ పరిధిలోని మన్సూర్‌పూర్‌ శివారులో ఎకరం భూమి ఉంది. ఈ భూమిని తన మనవళ్లు అయిన వినోద్‌, శ్రీకాంత్‌ల పేరుపై గిఫ్ట్‌ రిజిస్ట్రేషన్‌ చేయించేందుకు నాలుగు రోజుల క్రితం ఖేడ్‌ రెవెన్యూ కార్యాలయానికి వెళ్లింది. ఆయా రికార్డులు పరిశీలించిన అధికారులు రిజిస్ట్రేషన్‌కు సంబంధించి నమోదు చేసుకుని స్లాట్‌ బుక్‌ చేసి ఫొటోలు కూడా తీసుకున్నారు. రిజిస్ట్రేషన్‌ కోసం సోమవారం రావాల్సిందిగా లక్ష్మీబాయికి అధికారులు చెప్పగా...అక్కడ్నుంచి వెళ్లిపోయింది. అధికారులు చెప్పిన ప్రకారం సోమవారం కార్యాలయానికి వచ్చిన లక్ష్మీబాయి రిజిస్ట్రేషన్‌ కోసం ఎదురుచూసింది. అయితే డబ్బులు ముట్టజెబితేనే రిజిస్ట్రేషన్‌ చేస్తామని తహసీల్దార్‌ హసీనాబేగం చెప్పడంతో విసిగిపోయిన లక్ష్మీబాయి తన కుటుంబ సభ్యులతో కలసి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగింది. భూమి రిజిస్ట్రేషన్‌ చేసేంతవరకు ఆందోళన విరమించేది లేదని తెగేసి చెప్పగా సిబ్బంది వచ్చి ఆమెకు సర్దిచెప్పారు. విషయం తెలుసుకున్న 'సాక్షి'ఈ ఘటనపై తహసీల్దార్‌ హసీనాబేగంను వివరణ అడగగా...ముడుపుల కోసం లక్ష్మీబాయిని తను వేధించలేదని, మొత్తం మనవళ్ల పేరుమీద భూమి రిజిస్ట్రేషన్‌ చేస్తే ఆమె జీవనాధారం ఏమిటని మాత్రమే అడిగానని చెప్పారు. ఇక లక్ష్మీబాయి కూతుళ్లను కూడా రిజిస్ట్రేషన్‌కు తీసుకురావాలని స్పష్టం చేసినట్లు తెలిపారు.